




కళ్యాణదుర్గంలో విద్యార్థినులకు విద్యాదీవెన మెగా చెక్కును అందిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్


విద్యాభివృద్ధికి పెద్దపీట

◆ మంత్రి ఉషశ్రీచరణ్ ◆ జిల్లాలో రూ.28.43 కోట్ల విద్యాదీవెన సాయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. జిల్లాలో జూలై – సెప్టెంబర్, 2022 త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన పథకం కింద అర్హులైన 48,976 విద్యార్థులకు చెందిన 43,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.28.43 కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్‌ను బుధవారం జమ చేశారు. కళ్యాణదుర్గం, అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గంలో మంత్రి పాల్గొనగా, అనంతపురం నగరంలోని కెఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. వైసిపి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా ఉండేందుకు అన్ని విధాలా సాయం అందిస్తున్నారని చెప్పారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు విద్యాదీవెన మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ ఛైర్ పర్సన్ మంజుల, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ లిఖిత, నగర పాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, సిడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్ రెడ్డి, కెఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిరంగయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

జెసి కుటుంబాన్ని... వెంటాడుతున్న కేసులు



◆ ఆర్థిక వనరులపై వేటు
◆ గతంలో గనులు రద్దు... బస్సులు జప్తు
◆ ఇప్పుడు ఆస్తుల అటాచ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర రాజకీయ ప్రముఖుల్లో ఒకరుగానున్న జెసి కుటుంబాన్ని కేసులు వెన్నాడుతూనే ఉన్నాయి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కొక్క కేసు మీద పడుతూ వచ్చింది. ఇప్పుడు తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఈ కుటుంబంపై దృష్టి సారించింది. వారికి సంబంధించిన రూ.22.10కోట్ల విలువైన స్థిర,చరాస్తులను జప్తు చేసింది. వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తే వారి ఆర్థిక మూలాలపై ఒక్కొక్కటిగా వేటుపడుతూ వస్తోంది. ప్రారంభంలో అనుమతి ప్రాంతాల్లో బస్సులు నడుపుతున్నారన్న ఆరోపణలపై వాహనాలను సీజ్ చేశారు. దీంతో రాష్ట్రంలో పేరొందిన ప్రయివేటు రవాణా సంస్థగానున్న 'దివాకర్ ట్రావెల్స్' ఇప్పుడు ఎక్కడా కనిపించకుండాపోయాయి. ఇది ముగిస్తున్న సమయంలోనే మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డికి సంబంధించిన బైరైటీస్ గనులపై దర్యాప్తు ప్రారంభమైంది. గనులను అనుమతులకు మించి జరిపారన్న ఆరోపణలపై జరిమానాలు వేయడంతోపాటు, వాటిని జప్తు చేశారు. అంతకుమునుపే ఆరోపణలున్న త్రిశూల్ సిమెంటుకు కేటాయించిన గనులను నిబంధనలకు విరుద్ధంగా తవ్వారన్న ఆరోపణలపైనా దర్యాప్తు సాగుతూనే ఉంది. ఇవి జరుగుతున్న సమయంలోనే బిఎస్–3 వాహనాలను బిఎస్–4 వాహనాలుగా నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసి తప్పుడు పత్రాలతో 153 వాహనాలను రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై మొదట రవాణా శాఖ దర్యాప్తు ప్రారంభించింది. ఆ తరువాత పోలీసు శాఖ రంగ ప్రవేశం చేసింది. దీనిపై కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు సైతం జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు జెసి.అస్మిత్‌రెడ్డి వెళ్లివచ్చారు. ఇంకా దర్యాప్తు మందకొడిగా సాగుతోందని భావిస్తుండగానే కేంద్ర విచారణ సంస్థ ఎన్‌ఫోర్సుమెంటు సంస్థ రంగంలోకి దిగింది. మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డిల ఇళ్లపై కొన్ని నెలల క్రితం తనిఖీలు నిర్వహించారు. ఆ తరువాత విచారణ సైతం చేపట్టారు. ఇప్పుడు తాజాగా వారి స్థిర,చరాస్థులను జప్తు చేయడం పెద్ద చర్చనీయాంశమే అయింది. రూ.22.10 కోట్ల విలువైన ఆస్తులను ఇప్పుడు జప్తు చేశారు. ఈ రకంగా జెసి సోదరుల ఒక్కొక్క ఆర్థిక వనరులపై వేటు పడుతూవస్తోంది.

1982లో జెసి.దివాకర్‌రెడ్డి రాజకీయ రంగప్రవేశం చేశారు. అప్పటి నుంచి ఆ కుటుంబం ఓటమి ఎరుగకుండా తాడిపత్రిలో ఏక ఛత్రాధిపత్యం చెలాయిస్తూ వచ్చింది. ఆరుసార్లు వరుసగా జెసి.దివాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రారంభం నుంచి కాంగ్రెస్ పార్టీలోనున్న జెసి కుటుంబం 2014లో రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పుడు ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. 2019లో సీనియర్ నాయకులుగానున్న జెసి.దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కాకుండా వారి తనయులు జెసి.పవన్‌కుమార్‌రెడ్డి పార్లమెంట్ సభ్యులుగానూ, తాడిపత్రి శాసనసభకు జెసి.అస్మిత్‌రెడ్డిలు తొలిసారిగా పోటీ చేశారు. కాగ ఈ ఎన్నికల్లో ఇద్దరూ ఓటమి పాలయ్యారు. ఇదే సమయంలో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి జెసి కుటుంబానికి కష్టాలు తప్పలేదు. ఒక్కొక్కటిగా ఒకదాని తరువాత ఒకటి కేసులు పడుతూ వస్తునే ఉన్నాయి. వీటి నడుమే తాడిపత్రి పురపాలక సంఘం ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా టిడిపిని గెలిపించుకుని తమ పట్టుకుని నిలుపుకున్నారు. అయితే ఆర్థిక మూలాలపై పడుతున్న దెబ్బలతో వారి రాజకీయ భవిష్యత్ రాబోయే రోజుల్లో ఎటువైపు మళ్లుతుందన్నది చూడాల్సి ఉంది.

అదనపు కంప్యూటర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కంప్యూటర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్ వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే వందలాది మంది విద్యార్థులు ఇతర జిల్లాలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థుల జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాలలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. అలాంటి సందర్భంలో రెండు రోజుల క్రితం ఆన్‌లైన్ చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రకటన చేశారన్నారు. ఇప్పటికీ రెండు కంప్యూటర్ సెంటర్‌లు ఉండటం వల్ల కేవలం 200 మంది విద్యార్థులు మాత్రమే ఆన్‌లైన్ చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఐదు గంటలకు వచ్చి సాయంత్రం దాకా ఆకలితో ఉంటున్నారని తెలిపారు. మిగతా 800 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ చేయాల్సి ఉందన్నారు. 30వ తేదీ చివరి రోజు అంటూ చెప్పడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధరాన చేసినట్లు తెలిపారు. స్పందించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి అదనంగా ఏ గ్రూపుకు సంబంధించి ఆ గ్రూపుకు కంప్యూటర్ సెంటర్‌లను, ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. సమయం పెంచాలని పై అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సూర్యప్రకాష్, రాజేష్‌వర్ధన్, సాంబ, వర్షిత్ అనిల్, వంశీ, ధను, చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 8, 10 డివిజన్లలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం చేపట్టారు. కార్పొరేటర్లు లక్ష్మీదేవి, లావణ్య లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్లను ప్రతి ఇంటికీ అందజేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం తమదని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వసీం సలీమ్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా నాయకులను కలిసిన అమర్నాథ్

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి అనంతపురం పార్లమెంట్ బెస్త సాధికార కమిటీ అధ్యక్షులు బెస్త అమర్నాథ్ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును ఆయన నివాసంలో బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, అలం నరసానాయుడును పార్టీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, ఎం.ఆదినారాయణ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండి పరుశు రాం, శింగనమల నియోజకవర్గం బిసిసెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, వాణిజ్య విభాగం కార్యదర్శి దేరంగుల శంకరయ్య, రైతు విభాగం కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, మెండెం చిన్న ఎర్రిస్వామి, సూరి జంగంశెట్టి నవీన్, రవి, బెస్త నారాయణస్వామి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'విద్యాదీవెన'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన పథకాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నా దొరై కోరారు. బుధవారం ఉరవకొండలోని మహాత్మా జూనియర్ కళాశాల ఆవరణంలో విద్యా దీవెన చెక్కును పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయి చదువులు చదవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 5466 విద్యార్థులకు 4875 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.2,89,91,595 కోట్లు జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు పార్వతమ్మ, ఎంపిపి ఎఎస్‌డబ్ల్యూవో రామ్మోహన్, వార్డెన్ జగన్నాథ్, కళాశాల సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని తహాశీల్దారు

ఆత్మకూరు : ఆత్మకూరు మండల తహాశీల్దార్ సమయపాలన పాటించకుండా విధులకు చుట్టపుచూపుగా వస్తూ ప్రజలకు దర్శనం ఇస్తున్నారు. సోమవారం మినహా మిగిలిన రోజుల్లో ఆయన దర్శనం ప్రజలకు కరువవుతోంది. బుధవారం ప్రజాశక్తి తహాశీల్దారు కార్యాలయం వద్దకు వెళ్తే సమస్యలపై మండల ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఉదయం 11.30 గంటలు అయినా కార్యాలయంలో డిప్యూటీ తహాశీల్దారు మినహా ఎవరూ విధులకు హాజరు కాని పరిస్థితి కనిపిస్తోంది. వీఆర్వోలు ఫీల్డ్ పేరుతో కార్యాలయానికి రావడం లేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కార్యాలయంలో తహాశీల్దారు ఉండేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహాశీల్దారును ప్రజాశక్తి ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పంట పోయినా పట్టించుకోరా..?

◆ నకిలీ విత్తనాలతో పత్తి రైతులకు నష్టం
◆ అకిరా కంపెనీపై చర్యలు తీసుకోండి
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



నకిలీ విత్తనాల వల్ల ఎండిపోయిన పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

నకిలీ విత్తనాలతో పత్తి పంటను రైతులు పూర్తిగా నష్టపోయినా వ్యవసాయ అధికారులు పట్టించుకోరాని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రశ్నించారు. బుధవారం మండల పరిధిలోని వీరన్నపల్లి, తిమ్మాపురం, దిగువపల్లి గ్రామాల్లో నాసిరకం పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పంట సాగు నష్టం వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంలో దాదాపు 15 నుంచి 16 వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారన్నారు. అకిరా అనే పత్తి విత్తనాల సంస్థ ద్వారా విత్తనాలు కొనుగోలు చేశారన్నారు. అయితే ఈ విత్తనాలు నాశిరకంగా ఉండడంతో పంట ఏమాత్రం దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇదే పరిస్థితి పామిడి మండలంలోనూ ఉందన్నారు. ఇంత పెద్దఎత్తున రైతులు పంటను నష్టపోయినా వ్యవసాయ అధికారులు స్పందించకపోవడం విచారకరం అన్నారు. రైతులు పంటనష్టం విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే 'పంట నష్టపోతే ఇన్సూరెన్స్ వస్తుంది కదా' అంటూ వారు చెప్పే విడ్డూరమైన మాటలు అత్యంత దారుణం అన్నారు. రైతులు ఇన్సూరెన్స్ కోసం పంటలు వేయరన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. పంట దిగుబడి వస్తే చేసిన అప్పులు తీరుతాయన్న ఆశతో సాగు చేస్తారన్నారు. సాధారణంగా అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలను నష్టపోతారని, అందుకు విరుద్ధంగా నకిలీ విత్తనాలతో తాడిపత్రి ప్రాంతంలో ఈ సారి నష్టం వాటిల్లిందన్నారు. వర్షాలు బాగా ఉన్న సమయంలో నాసిరకం విత్తనాలతో పంటను నష్టపోవడం అత్యంత బాధాకరమన్నారు. పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులతో అంచాన వేయించి, నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసిన అకిరా సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రాజారాం రెడ్డి, సిపిఎం నాయకులు జగన్మోహన్ రెడ్డి, ఉమాగౌడ్, శ్రీరాములు, నాగరాజు తెరన్నపల్లి, తిమ్మాపురం, దిగువపల్లి రైతులు పాల్గొన్నారు.



పగలకుండానే ఎండిపోయిన పత్తి విత్తనం

శరవేగంగా అంతర్గత రోడ్ల అభివృద్ధి

నగర మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో శరవేగంగా అంతర్గత రోడ్ల అభివృద్ధి చేపడుతున్నట్లు నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 47వ డివిజన్ పరిధిలో రూ.21 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు పనులకు మేయర్ వసీం కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ దుర్గాదేవి లతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందులో భాగంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి సహకారంతో నగరంలో రోడ్ల అభివృద్ధికి తమ పాలకవర్గం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సిమెంట్ రోడ్ల ఏర్పాటుతోపాటు డ్రెయినేజీలను కూడా ఏర్పాటుచేసి పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టామన్నారు. నగరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18.92 కోట్లతో పాటు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయానికి రూ.20 లక్షలు వెచ్చించి నగరంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలో ప్రధాన రహదారుల అభివృద్ధితోపాటు అన్ని డివిజన్ల పరిధిలోని రహదారుల అభివృద్ధికి అత్యధికంగా నిధులను కేటాయిస్తోందన్నారు. గతానికి భిన్నంగా నేడు నగరంలో అన్ని డివిజన్లలో రోడ్ల అభివృద్ధి కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సమాజ స్వాప్నికుడు గురజాడ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆధునిక సమాజ నిర్మాణం కోసం సాహిత్యంతో జన చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడు గురజాడ అప్పారావు అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శారద స్కూల్, బిసి హాస్టల్, ఎంపిపి స్కూల్‌లో సెమినార్ నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు అంకె శ్రీనివాసులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, శారదా స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి తదితరులు హాజరై గురజాడ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు అంకె శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని గురజాడ అప్పారావు 70 ఏళ్ల క్రితమే చాటి చెప్పారన్నారు. ఆయన జీవితమంతా మహిళల సంక్షేమ అభివృద్ధి కోసం సాహిత్యం ద్వారా చాటి చెప్పారని తెలిపారు. మతాలన్నీ మాసిపోవును జ్ఞానమొక్కటే నిలుస్తుందని ఎలుగెత్తి చాటారన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ గురజాడ వర్ధంతి సభలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం గురజాడ పాటుపడ్డారని తెలిపారు. గురజాడ స్ఫూర్తిని సమాజం పెంపొందించుకోవాలన్నారు. గురజాడ స్మారక అవార్డును చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం అనేది గురజాడకు అవమానం అన్నారు. మూఢ విశ్వాసాలు పెంపొందించే వారికి ఇవ్వడం సరికాదన్నారు. ఐద్వా నాయకురాలు యమున మాట్లాడుతూ సామూహిక వంటశాలలు ఏర్పాటు చేయాలని గురజాడ 70 ఏళ్ల క్రితమే పిలుపునిచ్చారన్నారు. ఆధునిక మహిళల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడుతున్న గరిగపాటి నరసింహయ్య, చాగంటి కోటేశ్వరరావు లాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు హసీన, చంద్రిక, పార్వతి, సుబ్బమ్మ, రమీజా, ఉపాధ్యాయులు శ్రీదేవి, వాసుకి, రేణుక, శ్రీలత, ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా సెమినార్‌లో మాట్లాడుతున్న వక్తలు

ఉద్యాన యూనివర్శిటీ మెంబర్‌గా గెద్ది కేశవరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు గా రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన గెద్ది కేశవరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇరవై ఏళ్ళుగా ఉద్యాన వ్యవసాయ రంగంలో కేశవరెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి పాలక మండలి సభ్యులుగా నియమించడం విశేషం. ఆయన ఏపీ .ఆగ్రోస్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడుగా పని చేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సందర్భంగా ఉత్తమ రైతుగా అవార్డు అందుకున్నారు. 2013లో రాప్తాడు మండల పరిధిలోని మరూరు వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌గా, అధ్యక్షుడిగా పనిచేశారు. 2014 నుంచి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా జి.కేశవరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పురుగు మందుల డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ రెడ్డి, కార్యదర్శి సిరుగుప్ప వెంకయేశ్వర్లు, వైసీపీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రసాబాసగా కౌన్సిల్ సమావేశం

గుత్తి : పురపాలక సంఘ కార్యాలయంలోని సభా మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూర్ బి అధ్యక్షతన బుధవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం రాసాబాసగా సాగింది. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ బివి.నరసారెడ్డితో కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, నజీర్, షారుఖ్, అరవింద్, రమణ, అశ్వ రాముడు, ఖాజా ఖాన్ వాదనకు దిగారు. వార్డుల్లో చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైటిసి ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే మంచినీరు మూడు నెలలుగా రావడంలేదని, 40 రోజులుగా సత్యసాయి ప్రాజెక్టు నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని అన్నారు. వీధిలైట్లు మరమ్మతులకు గురయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తంచేశారు. వార్డుల్లో సమస్యలు తిష్టవేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు తమను నిలదీస్తున్నారని అన్నారు. సమస్యలను కౌన్సిల్ సమావేశపు అజెండాలో పొందుపరిచేందుకు అధికారులు సమయం లేదనడం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పేదలకు దుప్పట్లు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్ పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి సౌజన్యంతో రాజీవ్ కాలనీ సచివాలయం వద్ద 32 మంది పేదలకు దుప్పట్లు, బిస్కెట్లను బుధవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా కోగటం శ్రీదేవి, ఇంజినీరు పురుషోత్తం మురళీకృష్ణ హాజరై వాటిని అందజేశారు. ఈ సందర్భంగా కోగటం శ్రీదేవి మాట్లాడుతూ నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ వారు సమయానికి తగ్గట్టు వివిధ కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. చలికి ఇబ్బందులు పడుతున్న రామయ్య కాలనీ, భగత్‌సింగ్ నగర్, ప్రియాంక నగర్, నేతాజీ కాలనీలోని పేదలకు దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్ఐ గోపీనాథ్‌కు సన్మానం

గుత్తి : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాకే గోపీనాథ్‌ను వైసిపి నాయకులు బుధవారం సన్మానించారు. ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న గోపీనాథ్‌కు ఉన్నతాధికారులు ఇటీవల ఉప తహశీల్దారుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ శెట్టూరుకు బదిలీ చేశారు. బుధవారం ఆయన రిలీవ్ అవుతున్న సందర్భంగా వైసిపి నాయకులు గోపీనాథ్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో గోపీనాథ్ ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు షరీఫ్, సురేష్, గంగాధర్, సిద్ధ పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

కుందుర్పి : కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామ చెరువు కట్టపై ఏపుగా పెరిగిన కంపచెట్లను జెసిబి సాయంతో గ్రామ సర్పంచి మహదేవమ్మ బుధవారం తొలగించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తనయుడు విజయ్‌కుమార్, వైసిపి నాయకులు హనుమంత నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికల చట్టాలపై అవగాహన

ఆత్మకూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బర హేమలత అధ్యక్షతన జెండర్ మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. బాలికల చట్టాలపై మహిళలకు, బాలికలకు అవగాహన కల్పించి లింగ వివక్షకు గురికాకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య జెండర్ కమిటీ సభ్యులు రామాంజినమ్మ, భవాని, ఎంపిఎం మదన్ మోహన్, సిసి వెంకట నారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహనాల వేలంపాట

బొమ్మనహాల్ : కర్నాటక సరిహద్దు నుంచి మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డ 20 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, రెండు కార్లకు ఎక్సైజ్ అధికారులు బుధవారం వేలంపాట నిర్వహించారు. వేలంపాట ద్వారా రూ.7,32,280 ఆదాయం ప్రభుత్వ ఖాతాలోకి జమ అయినట్లు అధికారులు తెలిపారు. 40 మంది వేలంలో పాల్గొన్నారు.

ఎలుకల దాడి ఘటనపై ఎస్ఎఫ్ఐ ధర్నా



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండలంలోని సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాల వద్ద బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పాఠశాల ప్రధాన గేటు వద్ద నాయకులు విద్యార్థులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే విద్యార్థులపై ఎలుకలు దాడి చేశాయన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శీనా నాయక్, కృష్ణ, రవి నాయక్, వంశీ, పవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. సోమవారం అర్ధరాత్రి విద్యార్థులపై ఎలుకలు దాడిచేసిన ఘటనతో ఆయన పాఠశాలలోని డార్మెంటరీ గదులను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల మేనమామనని చెప్పుకునే సీఎం జగన్‌రెడ్డి కంసమామగా మారారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అశ్రద్ధ వల్లే పాఠశాలలోకి ఎలుకలు చొరబడి విద్యార్థులను గాయపరుస్తున్నాయని చెప్పారు. పాఠశాలలోని గదులకు తలుపులు, కిటికీలు లేకపోవడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని చెప్పారు. పాఠశాల వసతుల కోసమని అమ్మఒడి పథకంలో రూ.2 వేలు తగ్గించి ఇస్తున్న ప్రభుత్వం వసతులు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. 600 మంది విద్యార్థులకు బోధించేందుకు 26 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 12 మంది మాత్రమే ఉన్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి ఎస్టీసెల్ పార్లమెంట్ అధ్యక్షులు రమేష్ నాయక్, మాజీ ఎంపీపీ రాయల్ రామయ్య, నాయకులు గుమ్మనూరు వెంకటేష్, కేశప్ప, తలారి మస్తానప్ప పాల మల్లికార్జున, గోపాల్, బూసి, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో వసూలు చేసిన డబ్బు వెనక్కివ్వాలి

సాగు భూమిని రీసర్వే చేసి ఆన్‌లైన్‌లో నమాదు చేయాలి

ఆర్‌డిఒకు సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ వినతి



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూడేరు మండలంలోని రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామంటూ రెవెన్యూ అధికారులు వసూలు చేసిన డబ్బులు తిరిగి రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. కూడేరు మండల రైతులు సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఏవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ మండలంలో అత్యధిక మంది దళితులు, బిసి, పేదలైన రైతులు సాగు చేసుకుంటున్న భూమిని ఆన్‌లైన్‌లో తొలగింపు చేశారన్నారు. ఆ భూములను తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామంటూ అప్పటి తహశీల్దార్ శ్రీనివాసులు రైతుల నుంచి డబ్బులు వసూలు చేశారన్నారు. సదరు తహశీల్దార్ అవినీతి అక్రమాల ఆరోపణలతో జైలులో ఉన్నారన్నారు. అంతకు మునుపే రైతులు తమ డబ్బులు వెనక్కి ఇవ్వాలని 8 నెలలుగా అడుగుతున్నా రేపు మాపు ఇస్తానంటూ తప్పించుకున్నారని తెలిపారు. రైతుల భూములు ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా, డబ్బులు వెనక్కి ఇవ్వకుండా తీవ్ర నష్టం కలిగించారన్నారు. ప్రభుత్వం స్పందించి సదరు తహశీల్దార్ నుంచి డబ్బులు వసూలు చేసి రైతులకు చెల్లించాలన్నారు. రైతులు సాగు చేస్తున్న భూములను రీ సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. స్పందించిన ఏవో ఆర్‌డిఒ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సూరి, క్రిష్ణమూర్తి, రైతులు ముత్యాలు, నాగరాజు, ఎర్రిస్వామి, పెన్నొబిలేసు, నితీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవిఆర్ క్రీడాకారుల ప్రభంజనం

ఉరవకొండ : ఉరవకొండ జోనల్ లెవెల్ జూడో ఛాంపియన్ షిప్ పోటీలలో ఉరవకొండ ఎవిఆర్ క్రీడాకారులు ప్రభంజనం సృష్టించారని కళాశాల ప్రిన్సిపల్ విక్రమ్ బాబు, జూడో కోచ్ సాకే పురుషోత్తం తెలిపారు. ఈ నెల 29న వజ్రకరూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉరవకొండ జోనల్ లెవెల్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉరవకొండ ఎవిఆర్ పాఠశాల తరఫున 16 మంది క్రీడాకారులు పాల్గొని 4 గోల్డ్ మెడల్స్, 5 సిల్వర్ మెడల్స్ సాధించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ పోటీలలో ఎవిఆర్ విద్యార్థులు సెకండ్ ప్లేస్ సాధించారన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన క్రీడాకారులు అనంతపురం ఆర్‌డిటి స్టేడియంలో జరిగే సెంట్రల్ జోన్ లెవెల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు కె.లోకేష్ 60 కేజీలు, ఎస్.వరుణ్ లక్ష్మణ్ 45 కేజీలు, డి.అరవింద్ 40 కేజీలు, జి.శ్రీనివాసులు 30 కేజీల విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ సాధించారన్నారు. ఎ.ప్రణయ్ 91 కేజీలు, ఎం తయూబ్ 52 కేజీలు, లోకేష్ 42 కేజీలు, ఎం.వినయ్ 40 కేజీలు, మహిధర్ 25 కేజీల విభాగాలలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారులను పాఠశాల సిబ్బంది అభినందించి సన్మానించారు.

పంతం నెగ్గించుకున్న సర్పంచులు

శింగనమల : తిరుమల వెంకన్నను దర్శించుకుని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ సర్పంచులు తమ పంతం నెగ్గించుకున్నారు. మంగళవారం స్వామి వారిని దర్శించుకునేందుకు అలిపిరి నుంచి మెట్ల మార్గాన పాదయాత్రగా వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీముత్యాలరావు, ఛాంబర్ సభ్యులు దేగల కృష్ణమూర్తి, అన్ని జిల్లాల నుంచి వందలాదిగా తరలివచ్చిన సర్పంచులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. రాత్రి వరకు వారిని పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి కేసులు పెట్టారు. అయినా పట్టుదలతో సర్పంచులు బుధవారం ఉదయం వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని తమ పంతం నెగ్గించుకున్నారు. సర్పంచుల 12 డిమాండ్లను నెరవేర్చే విధంగా సిఎం జగన్‌కు సద్బుద్ధిని ప్రసాదించాలని, గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని, సర్పంచుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని స్వామి వారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు సింగంశెట్టి సబ్బరామయ్య, కొత్తపు మునిరెడ్డి, రావెల్ల సుధాకర్, ఎరుక నాయుడు, శ్రీనివాస యాదవ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే దుకాణ సముదాయం

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రజలు, వ్యాపారస్తుల సౌకర్యార్థం వాణిజ్య దుకాణ సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీ కూడలి సమీపంలో మాల్లస్ స్మిత్ ఎడ్యుకేషనల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాయలసీమ డయాస్ బిషప్ రేవ డాక్టర్ పి.ఐజాక్ వరప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు వాణిజ్య సముదాయంలో గదులు కేటాయించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మున్సిపల్ పాత కార్యాలయ భవనం స్థానంలో వాణిజ్య దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేసి 83 గదులు నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాటి నిర్మాణానికి అనుమతులు లభించాయన్నారు. పట్టణ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 కోట్లతో మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో సిసి రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడబోమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డి.వన్నూరుబీ, వైస్ చైర్‌పర్సన్ బి.పద్మలతారెడ్డి, ఎంపిపి జి.విశాలాక్షి, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు మంజునాథరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి బి.శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు హుస్సేన్ పీరా, గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, ఫారూఖ్, నరేష్, రమణ, కృపా సుజాతమ్మ, నాయకులు బళ్లారి రాజ్‌కుమార్ రెడ్డి, ఎం.రంగస్వామి, బి.రమేష్ రెడ్డి, సిఎస్ఐ టౌన్ చర్చి కమిటీ ఛైర్మన్ రెవ.డేవిడ్ నాయక్, వైస్ ఛైర్మన్ రెవ సాల్మన్, కన్వీనర్ సిబిజె రాసెల్ కిరణ్, సభ్యులు సురేంద్రబాబు, విజయ్ కుమార్, జేమ్స్, బింగి బాబు, జాన్ సునీల్, దయానంద్, విజయ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



గుంతకల్లులో మాట్లాడుతున్న తహశీల్దారు రాము

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి సమాజాన్ని నిర్మించేందుకు ఓటు వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి, గుంతకల్లు మండల తహశీల్దార్ బి.రాము విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.కృష్ణయ్య అధ్యక్షతన ఓటర్లకు క్రమబద్ధమైన అవగాహన, ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల భాగస్వామ్యం అను అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వీప్ నోడల్ అధికారి మండల తహశీల్దార్ బి.రాము హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు విధిగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా ఓటు విలువపై, ఓటు హక్కు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు అత్యంత విలువైనదని, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని ప్రతినిధులను ఎన్నుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్షావలి, ఎలక్షన్ ఆపరేటర్ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : ఎస్ఎస్‌బిఎన్ కళాశాల విద్యార్థులకు ఓటరు నమోదుపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. కమిషనర్ భాగ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, సెక్రటరీ డాక్టర్ నిర్మలమ్మ, నగరపాలక సంస్థ అధనపు కమిషనర్ రమణరెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం : అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాప్తాడు తహశీల్దారు లక్ష్మీనరసింహులు, డిప్యూటీ తహశీల్దారు మల్లికార్జున హాజరయ్యారు. విద్యార్థులచే ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు చేయించారు. ఓటరు జాబితాలో పేరు చూసుకోవడం, మార్పులు, చేర్పులు, ఫిర్యాదులు సమర్పించడం ఆన్‌లైన్ ద్వారా ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు, రాయుడు పెయ్యాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోట ముఖద్వారం జీర్ణోద్ధరణ చేపడతాం

రాయదుర్గం : పట్టణంలోని చారిత్రాత్మక కోట ముఖద్వారాన్ని జీర్ణోద్ధరణ చేస్తామని కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ డాక్టరు గోపీనాథ్ చెప్పారు. బుధవారం ఆయన అసిస్టెంట్ సూపరింటెండెంట్ డిఎం బోయ్, అనంతపురం కన్జర్వేషన్ అసిస్టెంట్ బాలకష్ణారెడ్డితో కలిసి కోట ముఖద్వారాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోట ముఖద్వారం కేంద్ర పురావస్తు శాఖ స్మారక కట్టడాల జాబితాలో లేనప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము ఈ కట్టడాన్ని పరిశీలించి దీని జీర్ణోద్ధరణకు అవసరమైన ప్రతిపాదనలు, అంచనాలు రూపొందించి ఆమోదం కోసం పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌కు పంపుతామన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో కోట ముఖద్వారం జీర్ణోద్ధరణ పనులు చేపడతామన్నారు. రాయదుర్గం చారిత్రక వివరాలను స్థానిక హెరిటేజ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ హులికుంటి మూర్తి, సంయుక్త కార్యదర్శి గుడేకోట శివకుమార్ తదితరులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టకేలకు దీనిని జీర్ణోద్ధరణ చేసేందుకు పురావస్తు శాఖ చొరవ చూపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ ప్రసన్న, సిపిఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రతినిధి కంసల నాగరాజు, అధ్యాపకులు అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి హుండీ లెక్కింపు

ఉరవకొండ : విడపనకల్ మండలం ఉండబండ గ్రామంలో వెలసిన ఉండబండ వీరభద్రస్వామి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అక్కిరెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈవో రమేష్ బాబు, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బసవరాజు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. 10 నెలలకు గాను రూ.15,81,260 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శ్రీ చైతన్య విద్యార్థులు

అనంతపురం : స్థానిక హౌసింగ్ బోర్డులోని ఏటీపీ-8 శ్రీ చైతన్య పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎజిఎం సుబ్బారెడ్డి చేతుల మీదుగా పచ్చ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు స్కూల్ నుంచి జెఎన్‌టియు మెయిన్ రోడ్డు వెంట ర్యాలీగా వెళ్తూ రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్టు ధరించని వారికి గులాబీ పుష్పం అందించి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ సిఐ ఎం.రంగస్వామి, ప్రిన్సిపల్ నేత్రావతి, కోఆర్డినేటర్ తిరుమలేశ్, డీన్ అరుణ్ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతకల్లు రైల్వే ఎస్పీగా కె.చౌడేశ్వరి

గుంతకల్లు : గుంతకల్లు రైల్వే నూతన ఎస్పీగా కె.చౌడేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె గూడూరు డీఎస్పీగా పనిచేశారు. నెల్లూరు క్రైం అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై గుంతకల్లు రైల్వే ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని చెప్పారు.

నేరాలు ఘోరాలు

పెన్నానదిలో మునిగి వ్యక్తి మృతి

పెద్దపప్పూరు : కేశఖండన కార్యక్రమానికి వచ్చి పెన్నానదిలో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పెద్దపప్పూరులోని అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాడిపత్రికి చెందిన గణేష్ (25) పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కుమారుడి కేశఖండన కార్యక్రమానికి పెద్దపప్పూరు అశ్వర్థ నారాయణస్వామి ఆలయానికి వెళ్లాడు. స్నానం చేసేందుకు సమీపంలోని పెన్నానది లోకి వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నదిలో మునిగిపోయాడు. బంధువులు నదిలోకి దిగి గణేష్‌ను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే అతను మరణించాడు. బంధువులు సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ నిందితులు అరెస్ట్

పుట్లూరు : పుట్లూరు మండలంలో విద్యుత్ మోటార్ చోరీకి పాల్పడిన వ్యక్తులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామంలో ఇంటిబయట ఉంచిన విద్యుత్ మోటారును అక్టోబర్ నెలలో తాడిపత్రికి చెందిన ఇద్దరు వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు నోస్సం రవీంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కొండాపురం క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని విద్యుత్ మోటారుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్లానింగ్ సెక్రటరీల సమావేశం

రాయదుర్గం : పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జయరామిరెడ్డి రాయదుర్గం పట్టణంలోని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జయరాంరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిపాలనలో సచివాలయాలు భాగమైనందున ఆయా సచివాలయాల పరిధిలో ప్రజల నుండి నిర్మాణాలకు దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు వారికి తగిన సేవలు అందించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి నివారణకు కృషి చేయాలన్నారు. సచివాలయాలలో ప్లానింగ్ విభాగం పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో వివిధ సచివాలయాలకు సంబంధించిన ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.

రంగనాథున్ని దర్శించుకున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన శ్రీ బొలికొండ రంగనాథ స్వామి ఆలయాన్ని విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత, ప్రాముఖ్యత గురించి ఆయనకు వివరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, కార్యనిర్వహణాధికారి వి.దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఈడిగ సంఘం ఆత్మీయ సమావేశానికి ఆహ్వానం

తాడిపత్రి రూరల్ : కదిరి మండలం ముక్తాపురం గ్రామం శ్రీ కంఠమహేశ్వరస్వామి సురమాంబ దేవి సన్నిదిలో నిర్వహించుకునే రాష్ట్ర వ్యాప్త గౌడ ఆత్మీయ సమావేశానికి ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు గౌడ జాతీయ ఉద్యమం అనంతపురం జిల్లా కమిటీ అధ్యక్షులు కంపరాజు ఆంజనేయులు తెలిపారు. బుధవారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆత్మీయ సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ కులస్తులకు జగనన్న ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో గౌడ కులస్తుల అభివృద్ధి తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చిస్తామని చెప్పారు. ఆహ్వానపత్రిక అందజేసిన వారిలో పెద్దవడుగూరు వెంకటస్వామి గౌడ్, శ్రీరాములు గౌడ్, శ్రీనివాసులు గౌడ్, నాగేంద్ర గౌడ్, ప్రకాష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సచివాలయాల తనిఖీ

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి నగరంలోని 32, 33, 68 సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని కార్యదర్శుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శులకు సూచించారు. 32వ వార్డు సచివాలయంలో పేదలందరికీ ఇల్లు పథకం కింద ఇళ్ల మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడారు.


సాగు భూమికి పట్టా ఇవ్వాలని వినతి

రాప్తాడు : తాను సాగుచేస్తున్న భూమికి పట్టా ఇవ్వాలని రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చెందిన పూజారి చెన్నకేశవులు ఆర్డీవో మదన్‌మోహన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా మరూరు గ్రామ సర్వే నెంబర్ 276 నందు ఖాళీగా ఉన్న 3 ఎకరాల భూమిని సాగు చేస్తున్నానని తెలిపారు. సాగులో ఉన్న భూమికి పట్టా ఇవ్వాలని పలుమార్లు రాప్తాడు తహశీల్దారుకు అర్జీలు ఇచ్చినా న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా పట్టా ఇచ్చి తనకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆర్డీవో విచారించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

మిడ్ పరీక్షల కేంద్రం తనిఖీ

అనంతపురం : అనంతపురం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరుగుతున్న బిటెక్ మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షల కేంద్రాన్ని ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ నియమ నిబంధనలు అమలు విషయంలో నిక్కచ్చిగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పరీక్ష హాలులో ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సుజాత, విభాగ అధిపతులు ఆచార్య ఎం.విశాలి, డాక్టర్ మాధవి, డాక్టర్ విష్ణువర్ధన్, ఒఎస్ డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ శ్రీదేవికి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న రమణ యాదవ్

ప్రజాశక్తి-పుట్లూరు

తెలంగాణా కార్పొరేటర్ బొంత శ్రీదేవికి ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి రమణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పుట్లూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి రామ్మోహన్‌పై ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. సోమవారం చర్లపల్లి డివిజన్‌లో దోబీఘాట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని ఆహ్వానించకుండా మంత్రి మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిలు ప్రారంభించారన్నారు. అ సందర్భంగా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమం గురించి తనకు చెప్పాల్సిన అవసరం ఉందని వారిని ప్రశ్నించిందన్నారు. దీనికి బేతి సుభాష్‌రెడ్డి అగ్రకుల అహంకారంతో గొల్లదానికేం తెలుసు.. నేను తలుచుకుంటే రూ.10 వేలు ఇచ్చి చంపించేస్తానని అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. సుభాష్‌రెడ్డి భేషరతుగా బొంత శ్రీదేవికి, యాదవ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా యాదవులంతా ఏకమై ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగరాజు యాదవ్, కృష్ణయ్య యాదవ్, గోపాల్ యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.